
అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అంగన్వాడీ సెంటర్లను పరిశీలించిన మేడ్చల్ కలెక్టర్

దుండిగల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీలోని బహాదూర్‌పల్లిలోని అంగన్వాడీ సెంటర్‌ను, మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న ఓల్డేజ్ హోమ్‌ను మేడ్చల్ జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ మంగళవారం సందర్శించారు. అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం గురించి వారినే అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని ఓల్డేజ్‌హోమ్‌ను పరిశీలించారు. వృద్ధుల కోసం నిర్మించిన హోమ్‌లో ఇప్పటి వరకు ఎవరూ చేరకపోవడం, ఆ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. ఆ భవనంలో సఖీ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చిన్నపిల్లల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా వెల్ఫేర్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా సీపీడీఓ శారద, గండిమైసమ్మ మండల ప్రత్యేక అధికారి బాబూమోజెస్, గండిమైసమ్మ తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, దుండిగల్ అంగన్వాడీ సెంటర్ ఇన్‌చార్జి శోభారాణి, అంగన్వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.


వరద బాధితులకు వాటర్, బిస్కెట్ ప్యాకెట్లు అందిస్తున్న సీబీఎన్ ఫాలోవర్స్

వరద బాధితులకు సీబీఎన్ ఫాలోవర్స్ సాయం

హైదర్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో భారీ వర్షానికి నిరాశ్రయులైన వారికి నిజాంపేట రోడ్డుకు చెందిన సీబీఎన్ ఫాలోవర్స్ హైదరాబాద్ టీం సభ్యులు వరద బాధిత ప్రజలకు ఆసరాగా నిలిచారు. వెయ్యి భోజనం, బిస్కట్స్ ప్యాకెట్స్ వాటర్ బాటిల్స్‌ను సోమవారం అందజేశారు. అదే విధంగా అక్కడ ప్రజలు వారికి వస్త్రాలు, దుప్పట్లు కావాలని కోరగా 2-3 రోజుల్లో ఏర్పాటు చేస్తామని టీం సభ్యులు చెప్పడంతో వారికి మరింత ధైర్యం కల్పించారు. త్వరలోనే వరద ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని సీబీఎన్ ఫాలోవర్స్ హైదరాబాద్ టీం సభ్యులు ప్రవీణ్, మహేష్, అనిల్, కిరణ్ తెలియజేశారు.

రైళ్ల రద్దుతో లింగంపల్లి రైల్వేస్టేషన్ వెలవెల


ఖాళీగా ఉన్న లింగంపల్లి రైల్వేస్టేషన్

గచ్చిబౌలి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పలు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే మూడు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేశారు. దీంతో లింగంపల్లి పరిసర ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దుచేసిన మూడు రైళ్లలో రెండు రైళ్లు మంగళవారం తిరిగి ప్రారంభించినట్లు లింగంపల్లి రైల్వే స్టేషన్ మాస్టర్ రాజు తెలిపారు. కాకినాడ, గౌతమి ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్లాయని, ముంబై- లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రాలేదని తెలిపారు. బుధవారం నుంచి జన్మభూమి, బీదర్-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లు కూడా రాకపోకలు సాగించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టడడం లేదని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ అన్నారు. ఏబీవీపీ మేడ్చల్ జిల్లా చింతల్ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాలేదని, యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చే శారు. లేకుంటే సెక్రటేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు మృత్యుంజయ, చింతల నగర సంయుక్త కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏబీవీపీ మేడ్చల్ కన్వీనర్ నగేష్

బాలామణికి నిత్యావసరాలు అందజేత

దుండిగల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఇల్లు కూలిన ఇబ్బందులు పడుతున్న బాలమణికి ఒక నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను మాజీ సర్పంచ్ కావలి గణేశ్ మంగళవారం అందించారు. దుండిగల్ గ్రామానికి చెందిన బాలమణి ఇల్లు వర్షాల కారణంగా సోమవారం కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న నిత్యావసరాలు తడిచి ముద్దయ్యాయి. దీంతో ఇద్దరు పిల్లలతో ఇబ్బందులు పడుతున్న ఆమెకు ఒక నెల సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యంరెడ్డి, తలారి రాజుముదిరాజ్, శ్రీనివాస్, బాబూ, రమేష్, వెంకటేష్, శివ, నాగేంద్రబాబు ఉన్నారు.


బాలమణికి నిత్యావసరాలను అందజేస్తున్న గణేశ్

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

నిజాంపేట్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లో పలు విభాగాలకు చెందిన అధికారులతో మేయర్ నీలారెడ్డి, రెండు రోజుల కితమే బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సౌజన్యలు వర్షాలతో సమస్యలు, అభివృద్ధిపై పలు విభాగాల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ, దోమలు, ఫాగింగ్, విద్యుత్ వంటి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని పలుశాఖల అధికారులను మేయర్,కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో మేనేజర్ పవన్‌కుమార్, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ

నిజాంపేట్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సౌజన్యను నిజాంపేట్ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవకమిటీ సభ్యులు, బీజేపీ జిల్లా నాయకులు మంగళవారం ఆమె కార్యాలయం వద్ద కలిశారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సుబ్బారావు, కో-కన్వీనర్ రచ్చ చక్రధర్, పద్మప్రసాద్, అశోక్, మురళీ, సత్యనారాయణ, నాగు పాల్గొన్నారు.


కమిషనర్‌తో భాగ్యనగర్ సభ్యులు

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

హైదర్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ పీజేఆర్‌నగర్ బస్తీకి చెందిన వీరేష్ వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన రూ.2.50లక్షల చెక్కు ను మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధితులకు అండగా సీఎం సహాయనిధి నిలుస్తుందన్నారు. వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాప్పక యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

చెరువులకు జలకళ

- నాలా దారి మళ్లింపు
- భయాందోళనలో పలు బస్తీవాసులు

గచ్చిబౌలి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు శేరిలింగంపల్లిలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. దీంతో పలు చెరువులు అలుగులు పారుతున్నాయి. నల్లగండ్ల పెద్దచెరువు పై నుంచి వచ్చిన వరదనీటితో పూర్తిగా నిండిపోయి అలుగు పారుతోంది. గచ్చిబౌలి బాలయోగి స్టేడియం, గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయం ఎదురుగా ఉన్న దేవునికుంట నుంచి ఈ చెరువులోకి నీరు వస్తోంది. నల్లగండ్ల చెరువు అలుగు పారుతుండటంతో నాలా నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చెరువు కింద ఉన్న నేతాజీనగర్, డాక్టర్స్‌కాలనీ వాసులు భయంభయంగా గడుపుతున్నారు. గతేడాది ఇదే మాదిరిగా అలుగు పారడంతో ఈ కాలనీలు ముంపునకు గురయ్యాయి. అదే పరిస్థితి ఇప్పుడు పునరావృతం అవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


అలుగు పారుతున్న నల్లగండ్ల పెద్దచెరువు

● నాలా దారి మళ్లించిన నిర్మాణ సంస్థ

చెరువు కింద ఓ భారీ నిర్మాణ సంస్థ ఆ చెరువు అలుగుపారే నాలాను ఇష్టానుసారం దారి మళ్లించడమే కాకుండా నేతాజీకాలనీ, డాక్టర్స్‌కాలనీ వైపు మళ్లించడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నిర్మాణ దారులకు అనుకూలంగా వ్యవహరించడంతోనే వారు ఇష్టారీతిగా నాలా దారి మళ్లించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరింతగా వర్షాలు పడితే తమకు కష్టాలు తప్పవని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహజసిద్ధంగా ఉన్న నాలాను పక్కకు జరపడం వల్లే తమ కాలనీలకు ముంపు సమస్య ఎదురవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నాలాను శుభ్రం చేయ్యడంతో ప్రస్తుతం నీరు సాఫీగా వెళ్తోందని, భారీ వర్షం పడితే ప్రమాదం ముంపు ప్రమాదం తప్పదని భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● శేరిలింగంపల్లిలోని చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. లింగంపల్లి గోపిచెరువు, చాకలివానికుంట, నేరేళ్లచెరువు, కొండాపూర్ కుడికుంట, మాదాపూర్ తుమ్మిడికుంట, గోపన్‌పల్లిలోని చెరువులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి పై నుంచి వచ్చే వరద నీరు అధికంగా వస్తుండడంతో అలుగు పారుతున్నాయని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని అన్ని చెరువులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈఈ నాగరాజు తెలిపారు.


మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సైబర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

గచ్చిబౌలి, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల సైబర్ ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, పలు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కాలనీవాసులు కలిసి వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సైబర్‌ఎన్‌క్లేవ్ కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

● **హైదర్‌నగర్:** వినాయకచవితిని పురస్కరించుకుని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టివినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని వివేకానందనగర్‌లోని ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.

● చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ ప్రగతినగర్ అంబీర్‌చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు.

● భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు చేసే ట్రాక్టర్స్ యజమానుల నుంచి రాంకీ సంస్థ అధిక ధరలు వసూలు చేస్తోందని హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యేకు విన్నవించారు. రాంకీ సంస్థ భవన వ్యర్థాలకు ఒక టన్నుకు రూ.350కి బదులు రూ.418లు తీసుకుంటుందన్నారు. ఒక ట్రాక్టర్ భవన వ్యర్థాల వల్ల రూ.1200 భారంగా మారిందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

● చేపల వేట


మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఫాక్స్‌సాగర్‌లోకి వరదనీరు ఎక్కువగా వచ్చి చేరుతోంది. కాలువలో వస్తున్న వరద నీటిలో యువకులు వలవేసి చేపలను పట్టుకుంటున్నారు.
- పేట్‌బషీరాబాద్, ఆంధ్రజ్యోతి

మురుగు వ్యవస్థను మెరుగుపరచాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): కొంపల్లి అభివృద్ధిలో దూసుకుపోతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మురుగునీటి వ్యవస్థను మెరుగు పరచాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొంపెల్లి పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్, కౌన్సిలర్స్ హజరై అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. రూ.19 కోట్ల 23 లక్షల నిధులను కేటాయిస్తు అన్ని వార్డులలో రోడ్లు, మురుగునీటి కాలువలు, కల్వర్టులు, వీధిదీపాలు, బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మించుట, శ్మశానవాటికల అభివృద్ధి, పబ్లిక్ టాయిలెట్స్ తదితర పనులకు నిధులు వెచ్చించనున్నట్లు తీర్మానం చేశారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. స్టాంప్ డ్యూటీ ఆదాయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

బాచుపల్లిలో ఎస్‌ఆర్ కళాశాల సీజ్

నిజాంపేట్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి రోడ్డులో ఉన్న బాలుర జూనియర్ కాలేజీ రెసిడెన్సియల్ క్యాంపస్‌లో సోమవారం కురిసిన వర్షానికి వరద నీరు భారీగా చేరింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, క్యాంపస్‌ను సందర్శించి, నిర్వాహకులను అప్రమత్తం చేశారు. దీంతో కళాశాల నిర్వాహకులు, విద్యార్థులందరినీ పక్కనే ఉన్న సప్తపది ఫంక్షన్‌హాల్‌కు తరలించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పా ట్లు చెయ్యాలని శానిటేషన్ అధికారి సుకృతారెడ్డి సూచించారు. మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు కారణంగా నీరు సెల్లార్ లోకి చేరడంతో గత రాత్రి హాస్టల్ నుంచి విద్యార్థులందరిని ఇళ్లకు పంపిచారు. మంగళవారం శానిటేషన్ అధికారి సుకృతారెడ్డి సిబ్బందితో కలిసి నిజాంపేట్‌లో ఉన్న పలు హాస్టల్స్‌ను సందర్శించారు. అదే విధంగా సప్తపది ఎస్ఆర్ కాలేజీ బిల్డింగ్‌లో ఉన్న శ్రీరామ్ స్కూల్‌ను సీజ్ చేశారు.


ఎస్ఆర్ కాలేజీ భవనం, ఇన్‌సెట్‌లో అధికారులు చేసిన సీజ్

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

మియాపూర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలను స్థానికులతో కలిసి మంగళవారం ఆయ న పరిశీలించారు. ఎడతెరిపి లేని వర్షానికి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ లైన్లు ధ్వం సమయ్యాయని ఆయన గుర్తించారు. వెంటనే రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదే విధంగా కాలనీలో పెండింగ్ ఉన్న పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అన్ని వేళలో ప్రజలకు అందుబాటులో ఉంటామని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలక వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంటీ అసోసియేషన్ సభ్యులు దేవేందర్‌రావు, దశరథ్‌రావు, విద్యానందచారి, సురేష్, రమేష్‌చంద్ర, నర్సింగ్‌రావు, విరూపక్షయ్య తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎంటీ స్వర్ణపురికాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

ఆభరణాలు తీసుకుని డబ్బు ఎగవేత

బంజారాహిల్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు విలువ చేసే ఆభరణాలు తీసుకొని డబ్బు ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.2లో తిబారుమల్ జువెల్స్ ప్రతినిధి సందీప్ అగర్వాల్‌కు కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి దుకాణానికి వచ్చే వినియోగదారుల పేర్లు చెప్పాడు. తనకు నగలు కావాలని, డిజైన్‌లను వాట్సాప్‌లో పంపించాలని కోరాడు. సందీప్ కొన్ని ఫొటోలు పంపాడు. వాటిలో గోల్డ్ కాయిన్ హారం, లక్ష్మీపికాక్ రూబీ హారం, నక్లెస్‌ను ఎంపిక చేసుకున్నాడు. వీటి విలువ రూ. 29.35 లక్షలు. తాను ఉంటున్న నార్సింగ్‌లోని రాజ్ పుష్పా ఎటర్నియా విల్లాకు పంపిస్తే చెక్కు ఇస్తానని చెప్పాడు. ఈ మేరకు సందీప్ నగలు పంపించగా అతడు రెండు చెక్కులు ఇచ్చాడు. మరుసటి రోజు సదరు వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్‌లో బ్యాలెన్స్ లేదు. రెండు రోజులు తర్వాత జమ చేయాలని చెప్పాడు. ఇలా వాయిదా వేస్తూ వస్తున్నాడు.

సందీప్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి రాజ్ పుష్పా ఎటర్నియాకు వెళ్లి వాకబు చేయగా విల్లాను ఖాళీ చేసినట్టు తెలిసింది. మోసపోయినట్టు గ్రహించిన సందీప్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు నైపుణ్యాలతోనే మెరుగైన ఉపాధి

● సింప్లీలెర్న్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో అదనపు నైపుణ్యాలను పొందడం ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమని నేటి తరం భావిస్తుందని సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. 18-27 సంవత్సరాల వయసు కలిగిన జెన్ జెడ్ తరాన్ని సింప్లిలెర్న్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ వివరాలను సింప్లిలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. మన దేశంలో యువతకు నైపుణ్యం మెరుగుపరచడం ద్వారా దాదాపు 10 కోట్ల మందిని వర్క్‌ఫోర్స్‌లోకి తీసుకురావచ్చని తెలిపారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడుతుందని, 2030 నాటికి అంతర్జాతీయంగా వర్క్‌ఫోర్స్‌లో 30 శాతం జెన్ జెడ్ ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిశ్రమలో మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జెన్ జెడ్ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటుందని వివరించారు. అదనపు నైపుణ్యాలను కోరుకుంటున్న వారిలో 66 శాతం బ్యాచ్‌లర్ డిగ్రీలను కలిగి ఉన్నారని తెలిపారు. దాదాపు 60 శాతం మంది అభ్యాసకులు ప్రస్తుతం ఐటీ రంగంలో ఉపాధి పొందుతుంటే, 40 శాతం మంది ఐటీయేతర రంగాలలో ఉపాధి పొందుతున్నారని, 83 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు మెరుగైన ఉద్యోగావకాశాలు పొందడానికి అదనపు నైపుణ్యాలను పొందాలని గట్టిగా కోరుకుంటున్నారని వెల్లడించారు. ఇలా కోరుకునే వారిలో బిజినెస్ ఎనలిటిక్స్‌ను 35.3 శాతం కోరుకుంటుంటే, ఏఐ, మెషీన్ లెర్నింగ్ టూల్స్ అభ్యసించాలని 33.9 శాతం, సైబర్ సెక్యూరిటీని 20.2 శాతం కోరుకుంటున్నారని ఆయన వివరించారు.

శుభకార్యానికి వెళ్లొచ్చే సరికి రూ.14 లక్షలు చోరీ

జీడిమెట్ల, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లివచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 14 లక్షల చోరీ చేశారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హనుమాన్‌రామ్ కుత్బుల్లాపూర్ గ్రామంలో స్టీల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం పై అంతస్థులో నివసిస్తున్నాడు. గత శనివారం బెంగళూరులో ఉంటున్న సోదరి ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. మంగళవారం ఇంటికి తిరిగి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రూ. 14 లక్షలు కనిపించలేదు. చోరీ అయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లద్దాల స్ప్రే విషయంలో విద్యార్థిపై దాడి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు విద్యార్థులు ఉంటున్న హాస్టల్ గదిలో వారి మధ్య గొడవ జరిగి ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన శౌర్యసింగ్ కొంపల్లి మున్సిపల్‌లోని జయభేరిలోని అయాతి కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ వసతి గృహంలో ఉంటోంది. కళ్లద్దాలు తుడిచే స్ప్రే విషయంలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. శౌర్యసింగ్‌ను గదిలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు వసతిగృహంపైకి తీసుకెళ్లి కొట్టడంతో గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులకు కళాశాల యాజమాన్యం సమాచారం అందించగా, కళాశాల వద్దకు వచ్చిన తల్లిదండ్రులు తమ కుమారుడిపై దాడి చేసిన విద్యార్థులు మీద పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. పోలీసులు కేసు కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఫతేనగర్‌లో జోరుగా అక్రమ షెడ్ల నిర్మాణాలు

ఫతేనగర్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో అక్రమ షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతూ షెడ్లు నిర్మిస్తున్నారని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూసాపేట్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నప్పటికీ వారికి అక్రమ షెడ్ల నిర్మాణాలపై వారు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఓల్డుఎయిర్ పోర్టు రోడ్డు, గౌతమీనగర్, తెనుగుబస్తీ, పోచమ్మగుడి తదితర ప్రాంతాలలో వాణిజ్య అవసరాల కోసం టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా షెడ్లను నిర్మిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఒకరిని చూసి మరొకరు షెడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకుంటూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ షెడ్ల నిర్మాణాలపై స్థానికులు కొందరు మూసాపేట సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారని ఫిర్యాదుదారులు వాపోయారు.

హైడ్రా పేరుతో రూ.20 లక్షలు డిమాండ్

- సోషల్‌వర్కర్ పేరుతో ఫిర్యాదుల దందా
- హైడ్రా కమిషనర్, మంత్రులతో దిగిన ఫొటోలతో బెదిరింపులు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు



పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ వర్కర్ ముసుగులో హైడ్రా పేరు చెప్పి రూ. 20 లక్షలు ఇవ్వాలని బిల్డర్లను డిమాండ్ చేసిన వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సాయివిల్లాస్ రోడ్డులో ఎంసీఆర్ఓ ప్రాజెక్ట్ పేరుతో జూబ్లీహిల్స్‌కు చెందిన బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజునాథ్‌రెడ్డి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. అన్ని రకాల అనుమతులు ఉన్నప్పటికీ, అపార్ట్‌మెంట్ పెద్ద చెరువు నాలా బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని, అదే కాలనీలో అద్దెకు ఉండే ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బండ్ల విప్లవ్‌సిన్హా కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ప్లాట్లు చూసేందుకు వచ్చే కస్టమర్లకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడు. సామాజిక కార్యకర్తగా చెప్పుకునే ఆయన పలు ప్రభుత్వ శాఖలకు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడం ప్రారంభించాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలుమార్లు అమీన్‌పూర్‌లో పర్యటించిన సందర్భంలో రంచన్‌గా ప్రత్యక్షమై ఆయనతో ఫొటోలు తీయించుకున్నాడు. గత నెలలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చిన మరుసటి రోజు బిల్డర్లు రాజేంద్రనాథ్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలను అశోకనగర్ పిస్తాహౌజ్ వద్దకు పిలిపించి, తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చాలా దగ్గర అని ఫొటోలు చూపించి బెదిరించాడు. అపార్ట్‌మెంట్ కూల్చకుండా ఉండాలంటే తనకు రూ.20 లక్షలు ముట్టచెప్పాలని లేదంటే, పత్రికల్లో వార్తలు రాయించి కూల్చివేయిస్తానన్నాడు. మరోమారు గచ్చిబౌలి ఆఫ్రికన్ కాఫీ హౌజ్ వద్దకు పిలిపించి తక్షణం ఎంతోకొంత డబ్బు ఇవ్వాలని, లేదంటే కూల్చడం ఖాయమని తీవ్రంగా బెదిరించాడు. హైడ్రా కమిషనర్‌తో పాటు గతంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతో దిగిన ఫొటోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడంతో బిల్డర్లు కంగుతిన్నారు. ఇతడి వేధింపులు భరించలేక బాధితులు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఎస్ఐ టి.విజయరావు తెలిపారు.

మద్యం మత్తులో సెల్లార్‌గుంతలో పడి యువకుడి మృతి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): మద్యం మతులో సెల్లార్ గుంతలో పడి యువకుడు మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాలు ప్రకారం.. కామారెడ్డి జిల్లా, మద్నూర్ మండలం, చిన్న తడ్గూర్ గ్రామానికి చెందిన నాగనాథ్ కుమారుడు ఎ.హన్మంత్(24) డిగ్రీ పూర్తి చేశాడు. గతనెల 30న ఉద్యోగం కోసం నగరానికి వచ్చి కొంపల్లి మున్సిపల్‌లోని సెంటర్ పార్కులో శ్రీమహాలక్ష్మి వసతి గృహంలో ఉంటున్న తమ్ముడు జయపాల్ వద్దకు వచ్చాడు. గత నెల 31న వసతిగృహం నుంచి బయటకు వెళ్లిన హన్మంత్ తిరిగి రాలేదు. 1న హన్మంత్ కనపడడం లేదని పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. కొంపల్లిలోని వేంకటరమణ లిక్కమార్ట్ సిట్టింగ్ రూమ్ వెనకాల గల సెల్లార్ గుంతలో హన్మంత్ శవమై కనిపించాడు. విషయం గమనించిన స్థానికులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● మురికి కాలువలో పడి..

పేట్‌బషీరాబాద్: మద్యం మత్తులో మురికికాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ అడ్మిన్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ, కమిటిపల్లి గ్రామానికి చెందిన మురంగి వెంకటేష్‌గౌడ్ 40 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చి కుత్బుల్లాపూర్ జీడిమెట్ల గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న కల్లు కాంపౌండ్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వెంకటేష్‌గౌడ్ కూతురు వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు కుమార్తె వద్దకు వెళ్లి ఉంటాడనుకున్న వారికి మంగళవారం ఉదయం కాలువలో పడి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు అతడి కుమారుడు శ్రీకాంత్‌కు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాంత్ తండ్రి మృతి చెంది ఉండడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు మురికి కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.